క్లుప్తంగా

రేపటి నుంచి గౌరీశంకరుల మహోత్సవాలు



ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో ఈ నెల 14 నుంచి 18 వరకూ గౌరీశంకరుల మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఈ ఉత్సవాలను ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ప్రారంభిస్తారన్నారు. ఉత్సవాల్లో భాగంగా 14న శ్రీరామాంజనేయుల యుద్ధం, 15న కురుక్షేత్రం నాటకాలు, 16న సినీ సంగీత విభావరి, 17న సత్యహరిశ్చంద్ర నాటకం, 18న డ్యాన్స్ హంగామా తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు వివరించారు. 22న స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వైభవంగా అమ్మవారి సారె ఊరేగింపు



అమ్మవారి మంగళస్నానానికి ముందు ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం దేవస్థానం నుంచి రామాలయం వరకూ అమ్మవారి ఉత్సవ విగ్రహం, సారె ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవస్థానం ఆవరణలో మంగళస్నానం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 14న గోదారంగనాథుల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్టు దేవస్థానం చైర్మన్ కోలా భీమేశ్వరరావు తెలిపారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రయాగమూర్తి



ఏలేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ప్రగడ ప్రయాగమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన కె.వెంకట్రావు వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. దీంతో కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తున్న ప్రయాగమూర్తిని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చినట్టు ఆయన తెలిపారు.

వేడుకగా స్పార్క్స్-2023



క్లాసికల్ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

గండేపల్లి: మండలంలోని జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాలులో శ్రీసూర్య ఎడ్యుకేషన్స్ ఆధ్వర్యంలో గురువారం స్పార్క్స్-2023 పేరిట పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి నృత్య ప్రదర్శనలు చేశారు. క్లాసికల్ డ్యాన్స్, భరతనాట్యం, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ సందర్భంగా శ్రీ సూర్య కరస్పాండెంట్ పోకల జగదీష్‌ను ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



తుని వీరవరపుపేటలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న బాలు

తుని: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు తెలిపారు. స్థానిక 24వ వార్డు వీరవరపుపేటలో గురువారం సాయంత్రం 'మన మున్సిపాలిటీ-మన బాధ్యత' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పరంగా అందిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదేశాల మేరకు పట్టణంలో పర్యటిస్తున్నామన్నారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచంద్రరెడ్డి, వైఎస్సార్ సీపీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్ పులి సత్యనారాయణ, నాయకులు బర్రె అప్పారావు, కాసే కపిల్, బి.సతీష్, కమిషనర్ ప్రసాదరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా..

- తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకున్న ప్రభుత్వం
- రంగుమారిన, మొలకెత్తిన ధాన్యం కొనుగోలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కోటనందూరులో తడిసిన ధాన్యాన్ని ఎండబెడుతున్న రైతులు

తుని రూరల్: మాండూస్ తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. వర్షానికి తడిసిన, రంగమారిన ధాన్యాన్ని సైతం సేకరించి రైతన్నలను ఆదుకొంది. సకాలంలో ఖరీఫ్ వరినాట్లు, కోతలు పూర్తయిన డెల్టా ప్రాంతంలో మాండూస్ తుపాను ప్రభావం కానరానప్పటికీ మెట్టప్రాంతమైన వ్యవసాయశాఖ తుని సబ్ డివిజన్ పరిధిలో తీవ్ర ప్రభావం చూపింది. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో వందలాది ఎకరాల్లో కోసి పనలపై ఉన్న పంట ముంపునకు గురైంది. వారం రోజుల పాటు పంట ముంపులో ఉండడంతో ధాన్యం మొలకెత్తి, రంగు మారాయి. రంగుమారిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందారు. రైతుల ద్వారా సమస్యను తెలుసుకున్న రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్, వ్యవసాయశాఖ జేడీలు వేర్వేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందజేశారు. జిల్లా కలెక్టర్ ఉత్తర్వులతో జేసీ, పౌర సరఫరాలశాఖ డీఎం ఆదేశాలతో రైతు భరోసా కేంద్రాల ద్వారా రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు అంగీకరించారు. ఇప్పటి వరకూ ఐదు మండలాల్లో నిబంధనల మేరకు 198 మంది రైతుల నుంచి రంగుమారిన, మొలకెత్తిన 8,310 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు.

38,893 ఎకరాల్లో వరిసాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 38,893 ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇప్పటికే 38,757.50 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. పంటకోత ప్రయోగాలు ద్వారా ఎకరాకు సరాసరిగా 26 క్వింటాళ్ల చొప్పున 10,11,238 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. ఆర్బీకేల ద్వారా 5670 మంది రైతుల నుంచి మిల్లర్లు 1,30,384 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో 198 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన రంగుమారిన, మొలకెత్తిన 8,310 క్వింటాళ్ల ధాన్యం ఉన్నాయి. 70 శాతం మంది రైతుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర జమ చేశారు. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లో ప్రభుత్వమే నేరుగా రైతు ఖాతాలకు జమ చేస్తుందని ఏడీఏ సుంకర బుల్లిబాబు తెలిపారు. రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయకపోతే మండల ఏఓలకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట నష్టపోకుండా రైతులకు అండగా నిలిచింది. మాండూస్ తుపానుకు తడిసి రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తోంది. మద్దతు ధర చెల్లించి రైతులకు భరోసా కల్పించాం.

– దాడిశెట్టి రాజా, రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి

స్పందించి సమస్య పరిష్కరించారు



తుపానుకు ధాన్యం తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందారు. తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై మంత్రి దాడిశెట్టి రాజా, జేసీ, ఇతర ఉన్నత అధికారులు సకాలంలో స్పందించి సమస్యను పరిష్కరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రంగుమారిన, మొలకెత్తిన ధాన్యాన్ని మిల్లర్ల కొనుగోలు చేశారు.

– లంక ప్రసాద్, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్

గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు
- సీతానగరంలో పార్కు ప్రారంభం



సీతానగరంలో అల్లూరి సీతారామరాజు పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: గ్రామాల అభివృద్ధికి దాతలు ముందుకు వస్తే వారికి అన్నివిధాలా సహకరిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట పంచాయతీ పరిధిలోని సీతానగరంలో కోడూరి సుబ్బన్న, పాపాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకట్రావు, మనములు రూ.20 లక్షలతో నిర్మించిన అల్లూరి సీతారామరాజు పార్కును గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. పార్కులో ఉత్సవాలు నిర్వహించుకోవడానికి వేదికను, అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని, పిల్లలు ఆడుకునేందుకు పలు పరికరాలను, పార్కు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఈ పార్కు నిర్మాణానికి జగ్గంపేట పంచాయతీ స్థలం రెండు ఎకరాలను కేటాయించినట్లు ఎమ్మెల్యే చంటిబాబు తెలిపారు. పార్కులోని అల్లూరి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని పార్కులా తీర్చిదిద్దిన కోడూరి వెంకట్రావు దంపతులు, కుమారులు శ్రీనివాస్, రామకృష్ణలను అభినందించారు. అనంతరం దాత కోడూరి వెంకట్రావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జగ్గంపేట గ్రామ ఉప సర్పంచి బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు



కోటనందూరులో అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

తుని: మండల పరిధిలోని అర్హులందరికీ త్వరలో ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఇందుకు అవసరమైన భూసేకరణ చేస్తున్నామని ఆర్డీవో సీతారామారావు తెలిపారు. కోటనందూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. మండల పరిధిలో 543 మందికి ఇంకా పట్టాలు ఇవ్వాల్సి ఉందని, ఇందుకు ప్రభుత్వ భూమిని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. అల్లిపూడి, ఇండుగపల్లి, టీజే నగరం, కోటనందూరు గ్రామాలకు సంబంధించి 516 మందికి పట్టాలు ఇవ్వడానికి 13 ఎకరాల భూమి అవసరమన్నారు. కేపీ మల్లవరంలో 6 ఎకరాల ప్రభుత్వభూమిని గుర్తించినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం డీటీ భాను , కోటనందూరు డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అన్నివర్గాలకూ సంక్షేమ పథకాలు



రాచపల్లిలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రాచపల్లిలో గడపగడపకూ...

ప్రతిపాడు రూరల్: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. మండలంలోని రాచపల్లి సచివాలయం-1 పరిధిలో గురువారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను (బంకు శ్రీను), గ్రామ సర్పంచ్ సారిపల్లి లోవలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు సారిపల్లి గంగరాజు, ఒమ్మి రమణ, పెద్దిరెడ్డి ప్రసాద్, పెద్దిరెడ్డి నానిబాబులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడున్నరేళ్లలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతి కుటుంబానికి వివిధ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే పర్వత దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరిందన్నారు. నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, పార్టీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు రెడ్నం వెంకటేశ్వరరావు, సర్పంచులు రొంగల నాగేశ్వరరావు, గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీలు మొల్లి వీరబాబు, ఉమ్మిడి తాతీలు, తటవర్తి రామన్న దొర, సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, గొంతిన సురేష్, పార్టీ నాయకుడు దోశ చిట్టిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

రౌతులపూడి: మారుమూల గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేయాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పారుపాకలో గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.15 లక్షలతో చేపట్టే డ్రైన్ నిర్మాణ పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం గ్రామంలో నిర్మించిన కల్వర్టును ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, సర్పంచ్ పకుర్తి లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు జి.వెంకటలక్ష్మి పలువురు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

గండేపల్లి: జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు మోటార్ సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు మండలంలోని తాళ్లూరు శివారుకు వచ్చేసరికి ప్రమాదానికి గురయ్యారు. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న నైట్ బీట్ పోలీసులు వైకుంఠం, సత్యనారాయణ వారిని స్థానికుల సహాయంతో 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది అని కొందరు, వీరే ప్రమాదానికి గురయ్యారని కొందరు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. క్షతగాత్రుల పేర్లు కె.రవితేజ, కిరణ కుమార్ అని తెలిసింది. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

కోడి పందేలు ఆడితే చర్యలు

కిర్లంపూడి: కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని కిర్లంపూడి ఎస్సై బి.తిరుపతిరావు హెచ్చరించారు. మండలంలోని కోడి పందాలు నిర్వహించే ప్రదేశాలను గురువారం తహసీల్దార్ కేవీ మాధవరావు, ఎస్సై తిరుపతిరావు పరిశీలించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని ప్రజలు జూదాల జోలికి పోవద్దని సూచించారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో సంక్రాంతి సంబరాలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి శ్రీభారతి విద్యానికేతన్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, హరిదాసు, గంగిరెద్దులు తదితర సంప్రదాయాలతో సంక్రాంతిని జరిపారు. విద్యార్థులు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. పాఠశాల కరస్పాండెంట్ సుంకర వీరబాబు, ఏఓ పెట్టిం మూర్తి, ఆర్.నాగచిన్న, అంబటి చక్రవేణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు సాంప్రదాయ వస్త్రాలు, హరిదాసు వేషధారణల్లో అలరించారు. చిన్నారులకు తల్లిదండ్రులు భోగిపండ్లు వేసి పలు పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇందిరారాణి, అంగన్‌వాడీ కార్యకర్త కొండారత్నం, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎస్‌వీఎస్ కళాశాలలో...

కిర్లంపూడి: మండలం జగపతినగరం ఎస్‌వీఎస్ కళాశాలలో గురువారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంట వెలిగించారు. మంట చుట్టూ విద్యార్థినులు కోలాటమాడారు. కళాశాల ప్రాంగణాన్ని రంగవల్లులతో సుందరంగా తీర్చిదిద్దారు. సంక్రాంతి విశిష్టతను అధ్యాపకులు వివరించారు. కరస్పాండెంట్ బీవీ రమణ, ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణ, వైస్.ప్రిన్సిపాల్ కె.ఆదినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కిర్లంపూడి: సంక్రాంతిని పురస్కరించుకుని జగపతి నగరంలో పంచాయతీ సిబ్బందికి గురువారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న 40 మంది సిబ్బందికి సర్పంచ్ మహేంద్రాడ శ్రీలత నూతన వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో గుడాల రాంబాబు, శరకణం సంతోష్, యల్లపు చిన్న, గుమస్త ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి క్రీడా పోటీలు



శంఖవరంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్



గోకవరం కబడ్డీ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

శంఖవరం: సంప్రదాయ క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారానే అసలైన సంక్రాంతి పండగ వస్తుందని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. గ్రామంలో రెండు రోజుల పాటు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి క్రీడా పోటీలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. యువత ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొని సత్తా చాటారు. మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోలీస్ శాఖ క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు బహుమతులు అందజేస్తారని తెలిపారు. పెద్దాపురం డీఎస్పీ ఎం. వెంకటేశ్వరావు, ఎంపీపీ పర్వత రాజబాబు, ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు, ఎస్సైలు శోభన్‌కుమార్, సుధాకర్, అజయ్‌బాబు, విద్యాసాగర్, ఎంపీడీఓలు జె.రాంబాబు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన క్రీడా సంబరాలు

తొండంగి: మండలంలోని దానవాయిపేటలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి క్రీడా సంబరాలు గురువారం ఉత్సాహంగా జరిగాయి. ఎస్సై బి.రవికుమార్ పర్యవేక్షణలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఒంటిమామిడి పోలీస్‌స్టేషన్ వద్ద మహిళలు, యువతులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

గోకవరం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం వద్ద నిర్వహిస్తున్న దాసరి వెంకటేశ్వరరావు(బాబు) మెమోరియల్ కబడ్డీ టోర్నమెంట్‌లో జట్లు హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ టోర్నమెంట్‌ను గ్రామ పెద్దలు దాసరి తమ్మన్నదొర, దాసరి రమేష్, సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు ఈ టోర్నమెంట్ జరుగుతుందని, శుక్రవారం ఫైనల్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.



తొండంగి మండలం ఒంటిమామిడిలో ముగ్గులు వేస్తున్న యువతులు

స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద



ఏలేశ్వరంలో రక్తదానం చేస్తున్న వివేకానంద సేవా సమితి ట్రస్టు సభ్యులు



కత్తిపూడిలో వివేకానంద చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జ్యోతుల శ్రీనివాస్



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న స్వామి శుభోదానంద

- ఘనంగా వివేకానంద జయంతి
- ఆయన సేవలను కొనియాడిన నేతలు



కోటనందూరులో ఎంపీపీ శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న యువకులు

ప్రత్తిపాడు: హిందూధర్మం ప్రాముఖ్యతను, మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహావ్యక్తి స్వామివివేకానంద అని తాడేపల్లిగూడెం నిచ్చలానందాశ్రమం స్వామి శుభోదానంద అన్నారు. స్థానిక జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న నరేంద్రగిరిపై స్వామి వివేకానంద పరిషత్ ఆధ్వర్యంలో గురువారం వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. తొలుత వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివేకానందుని జీవితచరిత్రను స్వామి శుభోదానంద వివరించారు. వివేకానంద పరిషత్ అధ్యక్షుడు డీవీఎస్ రమేష్ రాజు, శ్రీసూర్య భాస్కరానంద సరస్వతీ, రామకృష్ణ భావ పరిషత్ ప్రధాన కార్యదర్శి గుడాల వెంకటరత్నం, ఆర్‌ఎస్‌ఎస్ ఖండ సంఘ చాలక్ ముక్కు సుబ్రహ్మణ్యం, చెలంకూరి భాను పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్వామి వివేకానంద జయంతి వేడుకలు నియోజకవర్గవ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. మండలంలోని పెద్దనాపల్లిలో వివేకానందుని విగ్రహానికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యువతలో స్ఫూర్తి నింపిన వివేకానందుని జీవితం ప్రపంచానికే ఆదర్శమన్నారు. ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో వివేకానంద సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ట్రస్టు అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సుమారు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

తుని: ప్రపంచవ్యాపంగా భారతదేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపచేసిన స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని కోటనందూరు ఎంపీపీ లగుడు శ్రీనివాస్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజంలోని ప్రతి వ్యక్తి సామాజిక స్పృహతో ఎదుట వ్యక్తికి సహాయపడాలని కోరారు. అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడిలో సాయిప్రియ ట్రేడర్స్ ఆధ్వర్యంలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. సంస్థ అధినేత జ్యోతుల శ్రీనివాస్ వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువకులు వివేకానంద ఆశయ సాధనకు కృషి చేయాలని సూచించారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

కిర్లంపూడి: విద్యార్థులు స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జగ్గంపేట సీఐ బి.సూరి అప్పారావు సూచించారు. మండలంలోని జగపతినగరం ఎస్‌వీఎస్ కళాశాలలో గురువారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి సీఐ బి.సూరిఅప్పారావు, ఎస్సై బి.తిరుపతిరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజనోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం సీఐ సూరి అప్పారావును ఎస్‌వీఎస్ కళాశాల యాజమాన్యం శాలువాతో సత్కరించింది.

బీకేఎస్ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ

ప్రత్తిపాడు: గ్రామస్థాయిలో భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) బలోపేతానికి కృషి చేయాలని బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యల్లపు సూర్యనారాయణ కోరారు. ప్రత్తిపాడు మునసబు గారి రామాలయ ఆవరణలో గురువారం సాయంత్రం బీకేఎస్ జిల్లా స్థాయి ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఈ-క్రాప్ నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలంటే సంఘం బలిష్టంగా ఉండాలన్నారు. ఈ నెల 23న బీకేఎస్ జాతీయ కార్యవర్గ సభ్యులు కాకినాడ జిల్లాలో పర్యటిస్తారని చెప్పారు. జాతీయ కార్యవర్గ సభ్యుల పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, జిల్లా అధ్యక్షుడు గోపు నారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి జాజిమొగ్గల ఈశ్వర్, జిల్లా మహిళా ప్రముఖ్ దాడిశెట్టి జానకి, వివిధ మండలాల బీకేఎస్ ప్రతినిధులు రాపేటి శ్రీనివాస్, అల్లు శివరామకృష్ణ, బుద్దా సత్యనారాయణ పాల్గొన్నారు.